కనులపండువగా పాతగుట్ట లక్ష్మీనరసింహుడి కల్యాణం

స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న ప్రధానార్చక బృందం

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 10 : భక్తుల జేజేలు, మేళతాళాలు.. వేద పండితులు, అర్చకులు, పారాయణికులు వేద ఘోష నడుమ పాతగుట్ట లక్ష్మీనరసింహుడి కల్యాణ మహోత్సవం సోమవారం రాత్రి కనుల పండువగా జరిగింది. తుల లగ్న పుష్కరాంశ సుముహూర్తాన నారసింహుడు అమ్మవారి మెడలో మాంగళ్యధారణ చేసే ఘట్టాన్ని అర్చకులు, వేదపండితులు వైభవంగా జరిపారు. అంతకుముందు స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించిన గజ వాహనంపై ఆలయ తిరువీధుల్లో ఊరేగించారు. కల్యాణ వేడుకను చూడటానికి భక్తులు వందలాదిగా తరలివచ్చారు. ముందుగా కల్యాణ మండపంలో విశ్వక్సేనారాధన, స్వస్తీ పుణ్యాహవాచనం చేసి సంప్రోక్షణ చేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్త భాస్కరాయుని నరసింహమూర్తి, ఇన్‌చార్జి ఈఓ భాస్కర్‌రావు కంకణధారణ చేశారు. స్వామివారు ఉదయం హనుమంత వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. నిత్య పూజల అనంతరం సాయంత్రం 6గంటలకు పారాయణాలు, నిత్య హవనాలను ప్రధానార్చకులు, యజ్ఞాచార్యులు, అర్చకులు, పారాయణికులు పాంచరాత్రాగమ శాస్త్రం ప్రకారం నిర్వహించారు. వేడుకల్లో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య దంపతులు, కలెక్టర్ హనుమంతరావు, ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు, డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, ప్రధానార్చకులు నల్లన్‌ధీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వేంకటాచార్యులు, ఉప ప్రధానార్చకులు, ముఖ్య అర్చకులు, అర్చకులు, పరిచారకులు, వేద పండితులు, పారాయణికులు పాల్గొన్నారు.

ఈ నెల 19నుంచి స్వర్ణతాపడం మహాకుంభాభిషేకం

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 10 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన దివ్య విమాన గోపురం స్వర్ణతాపడం పనులు 90శాతం పూర్తయ్యాయి. ఈ నెల 14లోగా తాపడం పనులు పూర్తి చేసి 19నుంచి 23 వరకు విమాన గోపురం మహాకుంభాభిషేకం వానమామలై మధుర పీఠాధిపతి రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో చేపట్టనున్నట్లు ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. 23న ఉదయం 11:54గంటలకు మహా సంప్రోక్షణ క్రతువు నిర్వహించి దివ్య విమాన గోపురాన్ని స్వామివారికి అంకితం చేయనున్నట్లు సోమవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. పంచతల దివ్య విమానగోపురం 50.05 అడుగుల ఎత్తుతో దేశంలో అత్యంత పెద్దదైన గోపురమన్నారు. ఈ గోపురాన్ని స్వర్ణతాడపం చేసేందుకు 68 కిలోల బంగారాన్ని వినియోగించామని, చెన్నై స్మార్ట్ క్రియేషన్‌కు తాపడం పనులు అప్పగించామని, స్తపతి రవీంద్రన్ నేతృత్వంలో పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. మహా సంప్రోక్షణలో భాగంగా పంచ కుండాత్మక మహాయాగం నిర్వహణకు ప్రధానాలయ ఉత్తర మాఢవీధుల్లో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 108 మంది రుత్వికులతో ఐదు రోజులపాటు నారసింహ స్వామి మూర్తి మంత్ర, స్తోత్రం, వేదాలతో పాటు రామాయణ, భారత ఇతిహాసాల పఠనం కొనసాగించనున్నట్లు తెలిపారు. మాఢవీధులు, కొండ కింద వైకుంఠ ద్వారం, బస్టాండ్, వ్రత మండపాల్లో ఎల్ సీడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

గడ్డం స్వామి సేవలు మరువలేనివి

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

స్వామి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రామన్నపేట, ఫిబ్రవరి 10 : బీఆర్‌ఎస్ కోసం కష్టపడి పనిచేసిన గడ్డం స్వామి సేవలు మరువలేనివని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండలంలోని లక్ష్మాపురం గ్రామంలో బీఆర్‌ఎస్ మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు, ఉద్యమకారుడు గడ్డం స్వామి వర్ధంతిలో సోమవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోశబోయిన మల్లేశం, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కంభంపాటి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బత్తుల శంకరయ్య, మాజీ ఎంపీటీసీ సుధీర్ బాబు, నాయకులు కొండల్‌రెడ్డి, వెంకన్న, ఆమేర్, సంతోష్, మల్లేశం, వీరస్వామి, అనంతాచారి, మహేశ్, సత్యనారాయణ, గోపాల్, దశరథ పాల్గొన్నారు.

చేనేత త్రిఫ్ట్ పథకం దరఖాస్తుల స్వీకరణ

దరఖాస్తులు స్వీకరిస్తున్న చేనేత జౌళి శాఖ ఫీల్డ్ ఆఫీసర్ సత్యనారాయణ

ఆలేరు టౌన్, ఫిబ్రవరి 10 : పట్టణంలోని సిల్క్‌నగర్ కాలనీలో గల శివశంకర్ సిల్క్ సొసైటీలో మాజీ చైర్మన్ పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతకింది మల్లేశం ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా చేనేత జౌళి శాఖ ఫీల్డ్ ఆఫీసర్ సత్యనారాయణ చేనేత కళాకారుల నుంచి త్రిఫ్ట్ పథకం దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల 15వరకు దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. 16నుంచి 28వరకు క్షేత్ర స్థాయిలో స్వయంగా చేనేత కళాకారుల ఇంటికి వెళ్లి పరిశీలిస్తామని తెలిపారు. ఈ పథకం కింద జియో ట్యాగ్ కలిగిన చేనేత కళాకారులకు రూ.1200, అనుబంధ కళాకారులకు రూ.600 లబ్ధి చేకూరుతుందని చెప్పారు. కార్యక్రమంలో చేనేత కళాకారులు మెరుగు శ్రీధర్, బేతి శ్రీనివాస్, గట్టు రాజు, నాగులు, రవి, యాదగిరి, వెంకటేశ్, కృష్ణమూర్తి, గణేశ్, కళాకారులు పాల్గొన్నారు.

విద్యా రంగానికి 20శాతం నిధులు కేటాయించాలి : డీటీఎఫ్

నిరసన తెలుపుతున్న డీటీఎఫ్, టీఎస్‌ఈసీ నాయకులు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 10 : కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం విద్యా రంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో 20శాతం నిధులు కేటాయించాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి సుంకోజు భాస్కర్ అన్నారు. పట్టణంలోని వినాయక చౌరస్తాలో డీటీఎఫ్, తెలంగాణ విద్యా పరిరక్షణ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుల స్థానాల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు డీఎస్సీ నిర్వహించాలని కోరారు. అనంతరం డీటీఎఫ్ మండల శాఖ ఎన్నికలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సత్తయ్య, ఎన్.లక్ష్మీనర్సింహారెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ పి.సత్తయ్య, నూతన కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందజేస్తున్న బాల్య స్నేహితులు

రామన్నపేట, ఫిబ్రవరి 10 : మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన కునుకుంట్ల నర్సిరెడ్డి 20రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందారు. వెల్మినేడు ప్రభుత్వ పాఠశాలలో 2002-03 సంవత్సరంలో చదువుకున్న 10వ తరగతి విద్యార్థులు సోమవారం నర్సిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.85వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో భరత్‌కుమార్, నరేశ్, రాధ, మమత, నాగమణి, హేమవతి పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలి

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 10 : వరంగల్ - ఖమ్మం - నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నియయ నిబంధనలు పాటిస్తూ విధులు నిర్వహించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి నోడల్ ఆఫీసర్లకు సూచించారు. కలెక్టరేట్‌లోని మినీ మీటింగ్ హాల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నోడల్ అధికారులు నియమ నిబంధనలను పాటిస్తూ రోజువారీ రిపోర్టులను సమయంలో పంపాలన్నారు. జిల్లాలో ఉన్న 985 మంది ఓటర్లు సకాలంలో వచ్చి ఓటు హక్కు వినియోగించుకునేలా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అవసరమైన మెటీరియల్‌ను సకాలంలో పోలింగ్ కేంద్రాలకు చేర్చాలని, 17 పోలింగ్ కేంద్రాలకు 6 రూట్ల ద్వారా 17మండలాలకు బ్యాలెట్ బాక్సులు పంపేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బ్యాలెట్ బాక్సులు పోలింగ్ కేంద్రాలకు పంపే ముందు ఒకసారి పరిశీలన చేయాలన్నారు. సమావేశంలో అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ, భువనగిరి, చౌటుప్పల్ ఆర్డీఓలు కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, నోడల్ అధికారులు, సూపరింటెండెంట్‌లు రామారావు, శాంతిలాల్, డిటీ సురేశ్, ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయాల్లో ముసాయిదా ఓటరు జాబితా ప్రదర్శన

ఆత్మకూరు(ఎం) : మండల పరిషత్ కార్యాలయంలో ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ రాములునాయక్, ఎంఈఓ మహదేవరెడ్డి

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 10 : త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల ఓటర్ల జాబితాను సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాములునాయక్ ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 8ఎంపీటీసీ స్థానాలకు గాను మొత్తం మండలంలో 24,970 ఓట్లు ఉన్నాయన్నారు. ఇందులో పురుషులు 12,629, మహిళా ఓటర్లు 12,341మంది ఉన్నారని తెలిపారు. ఆత్మకూరు(ఎం) ఎంపీటీసీ పరిధిలో 4,999, కప్రాయపల్లి ఎంపీటీసీ పరిధిలో 2,704, కొరటికల్ పరిధిలో 3,033, కూరెళ్ల పరిధిలో 3,075, పల్లెర్లలో 3,175, రహీంఖాన్‌పేట పరిధిలో 3,305, పల్లెపహాడ్ పరిధిలో 2,732, సింగారం ఎంపీటీసీ పరిధిలో 2,947 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. మండలంలో మొత్తం 49 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో కొరటికల్, సింగారం, ఆత్మకూరు(ఎం) ఎంపీటీసీల పరిధిలోని అభ్యర్థుల నామినేషన్లను, కప్రాయపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో పారుపల్లి, కప్రాయపల్లి ఎంపీటీసీల పరిధిలోని నామినేషన్లను, పల్లెర్ల గ్రామపంచాయతీలో కూరెళ్ల, పల్లెర్ల, రహీంఖాన్‌పేట అభ్యర్థుల నామినేషన్లను స్వీకరించనున్నట్లు తెలిపారు. నామినేషన్ల స్వీకరణకు ఆత్మకూరు(ఎం)కు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మెహర్‌సాయి, కప్రాయపల్లికి ఐబీ ఏఈ వెంకటరమణ, కూరెళ్లకు మండల పశువైద్యాధికారి సంతోష్‌కుమార్ రిటర్నింగ్ అధికారిగా నియమించినట్లు తెలిపారు.

యాదగిరిగుట్ట మండలంలో 27,545మంది ఓటర్లు

యాదగిరిగుట్ట : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఓటరు జాబితా డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీ నవీన్‌కుమార్ సోమవారం విడుదల చేశారు. మండలంలో మొత్తం 27,545 ఓటర్లు ఉండగా.. అందులో 13,638 మంది పురుషులు, 13,907 మంది మహిళలు ఉన్నట్లు గుర్తించారు. డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌పై రెండు రోజుల్లో అభ్యంతరాలు, సూచనలు స్వీకరించనున్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై వారి సలహాలు, అభ్యంతరాలు తెలుసుకొని తుది జాబితాను కలెక్టర్‌కు నివేదించే అవకాశం ఉంది.

నేడు పోలింగ్ కేంద్రాల జాబితా

గుండాల : ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ముసాయిదా ఓటరు జాబితాను ఎంపీడీఓ దేవేందర్‌రావు నోటీస్ బోర్డుపై పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా వెలువరించనున్నట్లు తెలిపారు. ఆ తర్వాత రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి తుది జాబితా విడుదల చేస్తామని చెప్పారు.

ముసాయిదా ఓటర్ల జాబితా

భూదాన్ పోచంపల్లి : మండల పరిషత్ కార్యాలయంలో ముసాయిదా ఓటర్ల జాబితాను ఎంపీడీఓ రాపర్తి భాస్కర్‌గౌడ్ విడుదల చేశారు. మంగళవారం పది ఎంపీటీసీ స్థానాలకు పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా విడుదల చేయనున్నామని తెలిపారు. ఈ నెల 13న ముసాయిదా పోలింగ్ స్టేషన్లపై అభ్యంతరాలు, సూచనలు స్వీకరిస్తామని, అన్ని రాజకీయ పక్షాలతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. 14న ముసాయిదా పోలింగ్ స్టేషన్లపై అభ్యంతరాలు, సూచనలను పరిగణలోకి తీసుకొని పోలింగ్ స్టేషన్ల తుది జాబితా తయారు చేసి కలెక్టర్ ఆమోదం కోసం పంపిస్తామన్నారు. 15న తుది జాబితా ప్రదర్శిస్తామని చెప్పారు.

గుట్ట దేవస్థానంలో ఇద్దరు ఉద్యోగులపై వేటు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 10 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఇద్దరు ఉద్యోగులను ఆలయ ఈఓ భాస్కర్‌రావు సోమవారం సస్పెండ్ చేశారు. కొండపైన సీనియర్ అసిస్టెంట్‌గా విధుల్లో ఉన్న శ్రావ్య కొద్ది రోజులుగా అనుమతులు లేకుండా విధులకు గైర్హాజరయ్యారు. కొండ కింద వాహన పూజల్లో విధులు నిర్వహిస్తున్న రికార్డు అసిస్టెంట్ నర్సింగ్‌రావు వాహన పూజల్లో వచ్చిన నగదును దేవస్థానానికి చెల్లించడంలేదు. ఈ నేపథ్యంలో వీరిద్దరినీ విధుల నుంచి సస్పెండ్ చేశారు.

కొండపైకి వెళ్లే వాహనాలకు ఆన్‌లైన్ చెల్లింపులు

యాదగిరిగుట్ట : కొండపైకి వెళ్లే వాహనాలకు దేవస్థానం అధికారులు రూ.500 టికెట్ నిశ్చయించారు. ఇప్పటి వరకు నగదు మాత్రమే తీసుకుని అనుమతి టికెట్‌ను వాహనాదారులకు అందించేవారు. నగదు లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని దేవస్థానం దృష్టికి రావడంతో ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించే విధంగా మిషన్లను ఏర్పాటు చేశారు. నగదు అందుబాటులో లేకపోయినా ఆన్‌లైన్ మిషన్ ద్వారా చెల్లింపులు జరిపి కొండపైకి వెళ్లే వెసులుబాటు కల్పించారు. ఈ ప్రక్రియను సోమవారం అందుబాటులోకి తీసుకువచ్చారు.

'దివ్యాంగుల పెన్షన్ రూ.5వేలకు పెంచాలి'

మోత్కూరు, ఫిబ్రవరి 10 : దివ్యాంగుల పెన్షన్‌ను రూ.5వేలకు పెంచాలని, ఉపాధి హామీలో 200 పని దినాలు కల్పించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక భువనగిరి డివిజన్ ప్రధాన కార్యదర్శి గడ్డం యాదగిరి డిమాండ్ చేశారు. వేదిక ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో సోమవారం నిర్వహించిన ధర్నాలో మండలంలోని దివ్యాంగులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వికలాంగుల పరిరక్షణ చట్టం 2016ను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలన్నారు. బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సంఘం మండలాధ్యక్షుడు ఎర్రబెల్లి నాగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షులు నరేశ్, మల్లికార్జున్, ఎలేందర్, మహేశ్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

చౌటుప్పల్, ఫిబ్రవరి 10 : మున్సిపాలిటీలోని లింగోజిగూడెంలో సోమవారం మూర్ఛతో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. లింగోజిగూడెం అండర్ గ్రౌండ్ బ్రిడ్జి కింది నుంచి నడుచుకుంటూ వెళ్తున్న గుర్తుతెలియని వ్యక్తి అకస్మాత్తుగా మూర్ఛ వచ్చి కింద పడి అక్కడిక్కడే మృతిచెందాడు. సమీప వ్యక్తులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడికి 35 నుంచి 45 ఏండ్ల వయస్సు ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. అతని వద్ద ఎలాంటి ఐడీ కార్డులు లేకపోవడంతో మృతుడి వివరాలు తెలియలేదు. సీఐ మన్మథకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీ-ఫామ్ ఇచ్చేది ఎమ్మెల్యే కాదు.. పార్టీ అధిష్టానం

- కాంగ్రెస్ పార్టీ మోత్కూరు నాయకులు

మోత్కూరు, ఫిబ్రవరి 10 : స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేసే అభ్యర్థులకు బీ - ఫామ్ ఇచ్చేది ఎమ్మెల్యే కాదు.. పార్టీ అధిష్టానం అని మోత్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వల్లంభట్ల పూర్ణచందర్‌రావు, డీసీసీ ఉపాధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి, మండలాధ్యక్షుడు వంగాల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ నారగోని అంజయ్యగౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం వారు మీడియాకు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్యే మందుల సామేల్ తుంగతుర్తి నియోజకవర్గానికి తానే బాస్ అంటున్నారని, ఆయన నియోజకవర్గానికి ప్రజా ప్రతినిధి మాత్రమేనని గుర్తు పెట్టుకోవాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఆయన ఎన్నటికీ బాస్ కాలేరని తెలిపారు. తాము చిల్లర మల్లరగాళ్లం కాదని, సామేల్‌ను గెలిపించిన నిఖార్సయిన కార్యకర్తలమని పేర్కొన్నారు. పార్టీ బీ ఫామ్స్‌పై ఎమ్మెల్యే సతకం చేస్తే చెల్లదని ఎమ్మెల్యే సామేల్ తెలుసుకోవాలని సూచించారు. 'ఖబడ్దార్ అని ఎవరిని హెచ్చరించావ్. నియోజకవర్గ ప్రజలనా.. నిన్ను గెలిపించినా కార్యకర్తలనా? అని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు ఎన్నడూ ఓటు వేయని ఎమ్మెల్యే సామేల్ కుమారులకు ఇన్‌చార్జీలుగా బాధ్యతలు, పదవులు కావాలి. కానీ.. ఏండ్ల తరబడి పార్టీకి సేవలు అందించిన వారికి మాత్రం పదవులు ఇవ్వరా? అని ప్రశ్నించారు.

ఎమ్మెల్యే ఏకపక్ష నిర్ణయాల వల్లే నియోజకవర్గంలో కాంగ్రెస్ రెండు గ్రూపులుగా చీలిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా నియోజకవర్గ అభివృద్ధికి కలిసి రావాలని ఎమ్మెల్యేకు హితవు పలికారు.

ఏడాది పాలనలో ఏం చేశారో ప్రజలకు తెలుసు : బీఆర్‌ఎస్

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 10 : ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి ఏడాది పాలనలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఏంటో ప్రజలకు తెలుసని బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోషల్ మీడియాలో నిర్వహించిన ఆన్‌లైన్ సర్వే పోల్స్‌లో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డికి అధిక ఓటు శాతం నమోదైందని, ఈ విషయాన్ని కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని తెలిపారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై ఆన్‌లైన్ సర్వేలో అన్ని పార్టీల నాయకులు, ప్రజలు స్వచ్ఛందంగా ఓటు వేశారని తెలిపారు. ఇందులో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డికి 61.51శాతం, ప్రస్తుత ఎమ్మెల్యేకు 38.49శాతం ఓట్లు రావడం నిజమా.. కాదా? అని ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో ప్రజలు బహిరంగంగానే ప్రశ్నిస్తారని పేర్కొన్నారు.

డ్రైనేజీ గుంతలోకి దూసుకెళ్లిన కారు

డ్రైనేజీ గుంతలోకి దూసుకెళ్లిన కారును క్రేన్ సహాయంతో తీస్తున్న పోలీసులు

చౌటుప్పల్, ఫిబ్రవరి 10 : పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో సోమవారం ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించే ప్రయత్నంలో కారు అదుపుతప్పి డ్రైనేజీ గుంతలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి హాని జరుగలేదు. దీంతో సర్వీస్ రోడ్డులో ట్రాఫిక్ జామ్ అయ్యింది. ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి క్రేన్ సహాయంతో కారును బయటకు తీశారు. అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో భాగంగా ఆరు నెలలుగా సర్వీస్ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపడుతున్నారు. అక్కడక్కడ పనులు పూర్తికాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు సర్వీస్ రోడ్లు దుమ్ము ధూళితో దర్శనమిస్తున్నాయి. అసంపూర్తిగా వదిలేసిన డ్రైనేజీ గుంతల్లో నీరు చేరి దుర్వాసన వస్తుంది. అధికారులు స్పందించి పనులను త్వరగా పూర్తి చేయాలని పట్టణ ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

పొద్దెక్కినా.. వీడని పొగ మంచు



పోచంపల్లిలో కమ్మేసిన పొగ మంచు

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 10 : పట్టణంలో సోమవారం పొగ మంచు కప్పేసింది. పొద్దెక్కినా మంచు పోకపోవడంతో పనికి వెళ్లేవారు రహదారి కనిపించక ఇబ్బందులు పడ్డారు. ఉదయం 9గంటలకు లైట్లు వేసుకున్నా సరిగా కనిపించకపోవడంతో వాహనాలను రోడ్డు పక్కన నిలుపుకోవాల్సి వచ్చింది. పొద్దంతా ఎండ తీవ్రత, పొద్దుగూకితే చలి, తెల్లారితే మంచు.. ఇలా మూడు కాలాలు ఒకేరోజు కనిపిస్తున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు.

రామన్నపేటలో కోర్టు భవనానికి స్థల పరిశీలన

రామన్నపేటలో కోర్టు ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

రామన్నపేట, ఫిబ్రవరి10 : మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 584లో కోర్టు భవనాల నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సోమవారం అధికారులు, న్యాయవాదులతో కలిసి పరిశీలించారు. కోర్టు సముదాయం నిర్మాణానికి ఆటంకం కలుగకుండా చదును చేయించాలన్నారు. అనంతరం 704 సర్వే నెంబర్‌లో క్రీడా మైదానం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామన్నపేట అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తానని, పార్టీలకతీతంగా సహకరించాలని కోరారు. ఆయన వెంట ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, తాసీల్దార్ లాల్‌బహదూర్, ఎంపీడీఓ యాకూబ్‌నాయక్ ఉన్నారు.

పిల్లాయిపల్లి సబ్ సెంటర్‌లో డ్రోన్ సేవలు ప్రారంభం

పిల్లాయిపల్లి నుంచి భువనగిరి జిల్లా ఆసుపత్రికి తెమడ శాంపిల్స్‌ను తీసుకెళ్తున్న డ్రోన్

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 10 : ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రిసెర్చ్ ప్రాజెక్టులో భాగంగా మండలంలోని పిల్లాయిపల్లి ఆరోగ్య ఉప కేంద్రంలో డ్రోన్ సేవలను మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీవాణి సోమవారం ప్రారంభించారు. క్షయ నిర్మూలనలో భాగంగా అనుమానితుల నుంచి సేకరించిన తెమడ శాంపిల్స్‌ను డ్రోన్ ద్వారా భువనగిరిలోని జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో క్షయ వ్యాధి నిర్మూలనే ధ్యేయంగా నాలుగు రాష్ట్రాల్లో పైలెట్ ప్రాజెక్టుగా తెమడ శాంపిల్స్ సేకరించి పరీక్షలకు పంపుతునన్నట్లు తెలిపారు. బీబీనగర్ ఎయిమ్స్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామని, డ్రోన్ ద్వారా 15 నిమిషాల్లోనే జిల్లా కేంద్ర ఆసుపత్రికి శాంపిల్స్ చేరవేస్తామని చెప్పారు. దశల వారీగా అన్ని సెంటర్ల పరిధిలో డ్రోన్ సేవలు అందుబాటులోకి రానున్నాయన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పోతారెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ సందీప్, సీనియర్ టీబీ సూపర్‌వైజర్ శ్రీనివాసరెడ్డి, ఆరోగ్య కార్యకర్త సునీత, టీబీ నోడల్ పర్సన్ ఎంఏ బేగ్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దాతల సేవలు అభినందనీయం : ఎంఈఓ

రేకుల షెడ్‌ను ప్రారంభించిన ఎంఈఓ రఘురాంరెడ్డి, దాతలు చంద్రకళావెంకటరామిరెడ్డి

మోటకొండూర్, ఫిబ్రవరి 10 : పాఠశాలల అభివృద్ధికి దాతలు కంది చంద్రకళావెంకటరామిరెడ్డి చేస్తున్న సేవలు అభినందనీయమని ఎంఈఓ కేతిరెడ్డి రఘురాంరెడ్డి, ప్రముఖ కవి, గాయకుడు, చేయూత ఫౌండేషన్ చైర్మన్ వాకిటి రాంరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కంది శశిధర్‌రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ కంది చంద్రకళావెంకటరామిరెడ్డి సహకారంతో రూ.20వేలతో వంటశాల వద్ద నిర్మించిన రేకుల షెడ్‌ను సోమవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు చేయూత, కంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో తగిన పారితోషికం అందించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి కంది అనిల్‌కుమార్‌రెడ్డి, డైరెక్టర్ ఏనుగు నాగిరెడ్డి, శ్వేతారెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో వైద్య శిబిరం

గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి భరత్‌కుమార్

అడ్డగూడూరు, ఫిబ్రవరి 10 : మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో మండల వైద్యాధికారి భరత్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ విజినాచౌదరి, వైద్య సిబ్బంది సరోజన, మరియారాణి పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు పెంచాలి : సీపీఎం

మహాధర్నాకు తరలి వెళ్తున్న సీపీఎం నాయకులు

బీబీనగర్, ఫిబ్రవరి 10 : కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, సంక్షేమ రంగాలకు నిధులు పెంచాలని సీపీఎం మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను నిరసిస్తూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద సోమవారం చేపట్టిన ధర్నాకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అమలు, గిట్టుబాటు ధరలకు చట్టబద్ధత, దేశవ్యాప్త రైతు రుణమాఫీ కోసం ఐదు సంవత్సరాలుగా రైతులు ఉద్యమం చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించడంలేదని విమర్శించారు. ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ క్లస్టర్ నాయకులు కందాడి దేవేందర్‌రెడ్డి, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహిళా కన్వీనర్ పొట్ట యాదమ్మ, ప్రజా సంఘాల నాయకులు మంద కిరణ్, రేసు రామచంద్రారెడ్డి, బాబు, శివ, శోభ, లక్ష్మీనర్సమ్మ, బాలయ్య, బాలరాజు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు

అడ్డగూడూరు, ఫిబ్రవరి 10 : మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో పీజీటీ మ్యాథ్స్ అతిథి అధ్యాపక పోస్టు భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విజినాచౌదరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ మ్యాథ్స్, బీఈడీ పూర్తి చేసిన వారికి అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు 7032814727లో సంప్రదించాలని సూచించారు.